
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు

గురువారం 28 మార్చి 2024



396 తాబేళ్ల పిల్లలు స్వాధీనం

రైలులో తరలిస్తున్నట్టు సమాచారం రావడంతో డీఆర్‌ఐ దాడి

ఇద్దరిని పట్టుకుని అటవీశాఖకు అప్పగింత

-వార్త 7వ పేజీలో..



ఏమిటీ గందరగోళం?

» అరకులోయ అసెంబ్లీ అభ్యర్థిగా పాంగి రాజారావును ప్రకటించిన బీజేపీ

» రెండు నెలల క్రితమే దొన్నుదొరను తమ అభ్యర్థిగా ప్రకటించిన చంద్రబాబు

» బీజేపీకి పాడేరు అసెంబ్లీని కేటాయిస్తే, అరకులోయకు అభ్యర్థిని ప్రకటించడంపై టీడీపీ విస్మయం

» పాడేరు అసెంబ్లీ స్థానం టీడీపీకి?



అరకులోయ బీజేపీ అభ్యర్థి పాంగి రాజారావు



అరకులోయ అభ్యర్థిగా దొన్నుదొరను ప్రకటిస్తున్న చంద్రబాబునాయుడు (ఫైల్ ఫొటో)

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థుల ప్రకటనల నేపథ్యంలో మన్యంలో ప్రస్తుతం గందరగోళ పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో తమ పది అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ, ఇందులో భాగంగా అరకులోయకు పాంగి రాజారావును తమ అభ్యర్థిగా ప్రకటించింది. ఇప్పటికే అక్కడ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా చంద్రబాబునాయుడు ప్రకటించిన దొన్నుదొర గ్రామాల్లో దూసుకుపోతున్నారు. అయితే తాజాగా బీజేపీ ప్రకటనతో టీడీపీ శ్రేణులు విస్మయం చెందుతున్నారు.

బీజేపీ ప్రకటనతో గందరగోళ పరిస్థితి

కూటమి పొత్తులో భాగంగానే అరకులోయ పార్లమెంట్ స్థానం, పాడేరు అసెంబ్లీ స్థానాన్ని భారతీయ జనతా పార్టీకి కేటాయించారు. ఈ ఉద్దేశంతోనే ఈ ఏడాది జనవరి 20న అరకులోయలో జరిగిన టీడీపీ రా కదలిరా... బహిరంగ సభలోనే తమ పార్టీ అరకులోయ అసెంబ్లీ అభ్యర్థి దొన్నుదొరేనని నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. దీంతో అప్పటి నుంచి ఆయన తన నియోజకవర్గంలో ప్రచారం చేపడుతున్నారు. అలాగే అరకులోయ పార్లమెంట్ స్థానం పరిధిలో టీడీపీ కచ్చితంగా విజయం సాధించే తొలి అసెంబ్లీ స్థానం అరకులోయేనని పార్టీ అధిష్ఠానం సైతం భావించింది. అలాగే పొత్తుగా భాగంగా బీజేపీ నుంచి అరకులోయ ఎంపీగా కొత్తపల్లి గీత, పాడేరు అసెంబ్లీ అభ్యర్థిగా కురుసా ఉమామహేశ్వరరావులు బరిలో ఉంటారని ప్రచారం జరిగింది. ఈ తరుణంలో అనూహ్యంగా బీజేపీ నేతలు అరకులోయ అసెంబ్లీ స్థానానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావును తమ అభ్యర్థిగా ప్రకటించారు. రెండు నెలల క్రితమే ... మిగతా 8వ పేజీలో

ఉమ్మడి అభ్యర్థిని నేనే..



అరకులోయలో విలేకరులతో మాట్లాడుతున్న దొన్నుదొర


» మార్పుపై అధిష్ఠానం నుంచి ఎటువంటి సమాచారం లేదు

» పార్టీ శ్రేణులు ఆందోళన చెందొద్దు

» టీడీపీ అభ్యర్థి దొన్నుదొర

-వార్త 8వ పేజీలో...

అందాల జలపాతానికి వెళ్లేదెల?



ఉరకలేస్తున్న యర్రవరం జలపాతం (ఫైల్)

» ప్రకటనలకే పరిమితమైన యర్రవరం రహదారి నిర్మాణం

» అధ్వాన రోడ్డుపై ప్రయాణానికి పర్యాటకుల పాట్లు

» అభివృద్ధిని విస్మరించిన వైసీపీ ప్రభుత్వం

» హైడ్రో పవర్ ప్రాజెక్టుకు మాత్రం గ్రీన్ సిగ్నల్

» సర్కారు తీరుపై మండిపడుతున్న ఆదివాసీలు

చింతపల్లి, మార్చి 27:

పర్యాటకులను అమితంగా ఆకట్టుకుంటున్న యర్రవరం జలపాతానికి రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు తప్పడం లేదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో రహదారి నిర్మిస్తామని ప్రకటించడమే తప్ప ఇంత వరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. కాగా గిరిజనులు వ్యతిరేకిస్తున్న హైడ్రో పవర్ ప్రాజెక్టును యర్రవరం జలపాతానికి దిగువన నిర్మించేందుకు కేబినెట్ తీర్మానం చేసి షిర్డీసాయి ఎలక్ట్రికల్ కార్పొరేషన్ కంపెనీకి అప్పగించింది. రహదారి నిర్మాణంపై శ్రద్ధ చూపని వైసీపీ ప్రభుత్వం పవర్ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై ఈ ప్రాంతవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



అధ్వానంగా తయారైన సమగిరి, యర్రవరం రోడ్డు

చింతపల్లి మండలం గొందిపాకలు పంచాయతీ పరిధిలో యర్రవరం జలపాతం ఉంది. ఈ జలపాతాన్ని సందర్శించేందుకు చింతపల్లి- నర్సీపట్నం ప్రధాన రహదారి లంబసింగి ఘాట్ ప్రారంభం తురబాడుగెడ్డ నుంచి సమగిరికి వెళ్లే మార్గంలో వెళ్లాలి. తురబాడుగెడ్డ నుంచి సమగిరి వరకు తారు రోడ్డు ఉంది. అక్కడ నుంచి జలపాతానికి వెళ్లేందుకు మట్టి రోడ్డు(గ్రావెల్ రహదారి) మాత్రమే ఉంది. వర్షాలకు ఈ రహదారి ప్రస్తుతం అత్యంత అధ్వానంగా తయారైంది. రహదారిపై గొయ్యిలు ఏర్పడ్డాయి. పలు చోట్ల రహదారి కోతకు గురైంది. వర్షాకాలంలో ఈ మార్గం బురదమయంగా ఉంటుంది. వర్షం కురిసిన తరువాత ఈ మార్గంలో ప్రయాణమంటే సాహసమే. వాహనాల చక్రాలు బురదలో కూరుకుపోయి ముందుకు కదలవు. దీంతో పర్యాటకులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జలపాతం వద్దకు వ్యక్తిగత కార్లలో వచ్చే పర్యాటకులు సమగిరిలో వాహనాలను నిలిపివేసి అక్కడ నుంచి 3.5 కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించాల్సి వస్తున్నది.

అందాల జలపాతం

యర్రవరం జలపాతం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఏడేళ్ల కిందట తొలిసారిగా యర్రవరం జలపాతాన్ని 'ఆంధ్రజ్యోతి' బాహ్య ప్రపంచానికి పరిచయం చేసింది. తొలిరోజుల్లో కేవలం కార్తీక మాసంలో మాత్రమే పర్యాటకులు జలపాతం వద్దకు వచ్చి వనభోజనాలు చేసేవారు. అయితే నాలుగేళ్లుగా లంబసింగి సందర్శనకు వచ్చిన పర్యాటకులు యర్రవరం జలపాతాన్ని సందర్శిస్తున్నారు. ఈ జలపాతం వద్ద సుమారు వంద అడుగుల ఎత్తు నుంచి నీరు దిగువకు ప్రవహిస్తుంది. పాలధారలా నీరు ప్రవహిస్తుంటే పర్యాటకులు ఆస్వాదిస్తుంటారు. జలపాతం దిగువన సుమారు 150 మీటర్ల చాపరాయి ఉంది. దీంతో సీజన్‌లో జలపాతాన్ని సందర్శించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. ఈ జలపాతం లంబసింగికి సమీపంలో ఉండడంతో శని, ఆదివారాల్లో ... మిగతా 8వ పేజీలో

రాకపోకలకు ఇబ్బందులు



యర్రవరం జలపాతానికి రహదారి నిర్మించకుండా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. కానీ ఆదివాసీ గ్రామాలు, వ్యవసాయ భూములను ముంపునకు గురిచేసే హైడ్రో పవర్ ప్రాజెక్టుకి అనుమతులిచ్చేసింది. పవర్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నప్పటికి ప్రభుత్వం రద్దు చేయడం లేదు. యర్రవరం, పెద్దగెడ్డ- పెద్దూరు రహదారి నిర్మాణాలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. ప్రస్తుతం రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ఓటుతోనే సమాధానం చెబుతాం.

-బేరా సత్యనారాయణ పడాల్, యర్రబొమ్మలు



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ విజయసునీత

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత

రిటర్నింగ్ అధికారులతో కలిసి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

పాడేరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత సూచించారు. పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాల రిటర్నింగ్ అధికారులు అభిషేక్, భావనలతో కలిసి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లు, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాల ఏర్పాట్లను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయసునీత మాట్లాడుతూ ఎవరికీ ఎటువంటి అపోహలకు తావులేకుండా ఎన్నికలు, భద్రత, కౌంటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల సామగ్రి పంపిణీ, పోలింగ్ అనంతరం వాటిని స్వీకరించడం, భద్రపరచడం వంటి చర్యలపై అధికారులకు ఆమె పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.అంబేడ్కర్, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈ డీవీఆర్ఎం.రాజు, డీఈఈ అనుదీప్, తహసీల్దార్ కల్యాణచక్రవర్తి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జలకళ లేని జోలాపుట్టు స్పిల్‌వే డ్యాం

అడుగంటిన భూగర్భ జలాలు

మత్స్యగెడ్డ పాయల్లో తగ్గిన నీటి నిల్వలు

ఈ ఏడాది జల విద్యుత్ కేంద్రానికి తప్పని నీటి కష్టాలు

ముంచంగిపుట్టు, మార్చి 27: ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరందించే జోలాపుట్టు స్పిల్‌వే డ్యాం అడుగంటిపోయింది. నిత్యం నీటితో కళకళలాడే డ్యాం ప్రస్తుతం నీరు లేక వెలవెలబోతోంది. ఈ ఏడాది వేసవి ప్రారంభంలోనే ఎండలు ఠారెత్తిస్తుండడం, భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో మత్స్యగెడ్డ పాయల్లో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టాయి. దీని వల్ల మత్స్యగెడ్డ ప్రవాహిత నీటిపై ఆధారపడి ఉన్న జోలాపుట్టు ప్రధాన జలాశయం, స్పిల్‌వే డ్యాంతో పాటు డుడుమ (డైవర్షన్)డ్యాంలో నీటి నిల్వలు కనిష్ఠ స్థాయికి చేరుకుంటున్నాయి.



జోలాపుట్టు స్పిల్‌వే డ్యాం అడుగంటిన దృశ్యం

తగ్గిన నీటి నిల్వలు

జోలాపుట్టు, డుడుమ జలాశయాల్లో నీటి నిల్వలు ఈ ఏడాది గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. మత్స్యగెడ్డ అడుగంటిపోవడంతో ఆయా జలాశయాలకు ఇన్‌ఫ్లో తగ్గిపోయింది. జోలాపుట్టు జలాశయానికి 2,750 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం ఉండగా, బుధవారం 2,703.20 అడుగుల నీటిమట్టం నమోదైంది. గతేడాది ఇదే సమయానికి ఈ జలాశయంలో 2,729.80 అడుగుల నీటిమట్టం నమోదైంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది సుమారు 26 అడుగుల నీరు తక్కువగా ఉంది. జోలాపుట్టు జలాశయానికి సమీపంలో ఉన్న స్పిల్‌వే డ్యాం పూర్తిస్థాయిలో అడుగంటిపోయింది. అలాగే ఈ జలాశయానికి దిగువ ప్రాంతంలో ఉన్న డుడుమ(డైవర్షన్)డ్యాంలో 2,590 అడుగుల నీటిని నిల్వ ఉంచే సామర్థ్యం ఉండగా, ప్రస్తుతం 2,578.40 అడుగుల నీటిమట్టం నమోదైంది.

దీంతో జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పాదనకు అవసరమైన నీటిని డుడుమ జలాశయం నుంచి సరఫరా చేస్తున్నారు. మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో మొత్తం ఆరు జనరేటర్ల సహాయంతో 120 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన చేసే సామర్థ్యం ఉంది. అయితే ప్రస్తుతం రెండు జలాశయాల్లో నీరు ఆశించిన స్థాయిలో లేకపోవడం, స్పిల్‌వే డ్యాం అడుగంటిపోవడంతో కేవలం ఒక జనరేటర్ సహాయంతో 17 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన మాత్రమే చేపడుతున్నారు. మిగిలిన ఐదు జనరేటర్లను నిలిపివేశారు. ఈ ఏడాది జల విద్యుత్ కేంద్రానికి నీటి సమస్య కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది.



పాడేరులో డీఎంహెచ్‌వో జమాల్ బాషాతో భేటీ అయిన జెడ్ఎంవో శాంతిప్రభ

జిల్లాలో మలేరియా స్థితిగతులపై ఆరా

జోనల్ మలేరియా అధికారి సుడిగాలి పర్యటన

వెల్‌నెస్ సెంటర్, పీహెచ్‌సీ, పలు గ్రామాలు సందర్శన

పాడేరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జోనల్ మలేరియా అధికారి శాంతిప్రభ బుధవారం పాడేరు మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆమె మండలంలో ఈదులపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వంట్లమామిడిలోని వెల్‌నెస్ సెంటర్, కందులపాలెం, చింతాడ గ్రామాలను సందర్శించారు. అనంతరం జిల్లాలోని మలేరియా స్థితిగతులపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సి.జమాల్ బాషాతో చర్చించారు. పాడేరు చేరుకున్న ఆమె తొలుత సలుగు పంచాయతీ ఈదులపాలెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలోని కందుపాలెం, చింతాడ గ్రామాల్లో మలేరియా కేసులు అధికంగా నమోదవుతున్నాయని ఆమె గుర్తించి, ఆయా గ్రామాలను సందర్శించారు. గ్రామాల్లోని వైద్యసిబ్బంది, ప్రజలతో ఆమె మాట్లాడారు. మలేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్య సిబ్బంది చేపట్టాల్సిన చర్యలను జెడ్ఎంవో వివరించారు. అనంతరం వంట్లమామిడిలోని వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించి, రికార్డులు పరిశీలించారు. తరువాత ఆమె పాడేరులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సి.జమాల్ బాషాతో భేటీ ... మిగతా 8వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురు)	6.13
సహరి (శుక్ర)	4.41

ఆంధ్రజ్యోతి

ఆంధ్రజ్యోతి దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు,

9985411639

ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబరుకు సంప్రదించగలరు.

9985411029

ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి

» కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశం

» ఎన్నికల కోడ్ అమలుపై జిల్లా కలెక్టర్లు, ఆర్‌వోలతో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ విజయసునీత, జేసీ భావన, ఐటీడీఏ పీవో అభిషేక్. (ఇన్‌సెట్లో) కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఎన్నికల కమిషన్ సీఈవో

పాడేరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని, ఈ క్రమంలో అధికారులకు వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని అధికారులను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) ముఖేశ్‌కుమార్ మీనా ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమలుపై బుధవారం జిల్లా కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు సంబంధించిన అనుమతుల కోసం 48 గంటల ముందే సువిధ యాప్‌ద్వారా లేదా వ్యక్తిగతంగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అలాగే అధికారులు ఆయా దరఖాస్తులను పరిశీలించి 24 గంటల్లో అనుమతులు జారీ చేయాలని సీఈవో సూచించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అధికారులకు అందిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలన్నారు. ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితులను ఈ సందర్భంగా ముఖేశ్‌కుమార్ మీనా వివరించారు. ఎన్నికల సామగ్రి, ఈవీఎంలు, వీవీప్యాట్‌లు, స్ట్రాంగ్ రూమ్, పంపిణీ కేంద్రం, స్వీకరణ కేంద్రం, పోలింగ్ అనంతరం ఈవీఎంలు భద్రపరచడం, కౌంటింగ్ తదితర అంశాలపై ఆయన చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత, పాడేరు అసెంబ్లీ ఆర్‌వో, జేసీ భావన వశిష్ఠ, అరకులోయ ఆర్‌వో, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.అంబేడ్కర్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

హాట్‌కేకుల్లా అమ్ముడైన ఐపీఎల్ టికెట్లు

చెన్నై సూపర్‌కింగ్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ టికెట్లు అమ్మకాలు ప్రారంభించిన రెండు గంటల్లో సోల్డ్ అవుట్

మధ్యాహ్నం 12.30 గంటలకే అయిపోయిన రూ.1,000, రూ.1,500, రూ.3,000, రూ.4,000 టికెట్లు

మిగిలిన ధరల టికెట్ల అమ్మకాలపై స్పష్టత నిల్

విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 27:

ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్‌కింగ్స్ మధ్య ఈనెల 31న నగరంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లు దాదాపు అయిపోయాయి. పేటీఎం ఇన్‌సైడర్ ద్వారా బుధవారం టికెట్ల అమ్మకం ప్రారంభించగా ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి

రాంబిల్లి, మార్చి 27: ఎస్‌ఈజడ్‌లోని సింబయో జనరిక్స్ ఫార్మా కంపెనీల్లో ఈనెల 14 వ తేదీన జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విశాఖలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని పెదకలవలాపల్లికి చెందిన కలవలపల్లి నరసింగరావు(47) మంగళవారం రాత్రి మృతి చెందినట్టు సీఐ లక్ష్మణరావు తెలిపారు. విశాఖ కేజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించామన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురు కార్మికులు గాయపడ్డారని, వీరిలో చోడవరం మండలం గోవాడకి చెందిన ఎ.రాము ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 24న మృతి చెందగా, నరసింగరావు 26న రాత్రి మృతి చెందాడన్నారు. రాంబిల్లి మండలం మర్రిపాలెంకు చెందిన అమలుకంటి సన్యాసిరావు అనే మరో కార్మికుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. నరసింగరావు కుటుంబాన్ని ఆదుకోవాలని సింబయో కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపినట్టు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడునాయుడు తెలిపారు. కంపెనీ నుంచి రూ.20 లక్షలు, కాంట్రాక్టర్ నుంచి రూ2.75 లక్షలు నరసింగరావు కుటుంబానికి ఇవ్వడానికి ఒప్పందం కుదిరిందన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు..

నర్సీపట్నం, మార్చి 27: మునిసిపాలిటీ పరిధి సుబ్బారాయుడుపాలెం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనకు సంబంధించి పట్టణ ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాలివి. మాకవరపాలెం మండలం తామరం గ్రామానికి చెందిన మంత్రి వెంకట రత్నకుమారి (66) మంగళవారం ఎస్.రాయవరం మండలం కొత్త పోలవరంలో నివాసం ఉంటున్న కూతురు, అల్లుడు వద్దకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి వెళ్లి పోతానని అల్లుడుతో చెప్పి స్వగ్రామం బయల్దేరింది. రాత్రి సుబ్బారాయుడుపాలెం వద్ద రక్తపు మడుగులో ఆమె పడి ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు అక్కడికి చేరుకొని విచారణ జరిపారు. మృతురాలు వెంకట రత్నకుమారిగా గుర్తించారు. ఆమెకు మానసిక ఆరోగ్య స్థితి సరిగా ఉండదని, కుటుంబ సభ్యులు వైద్యం చేయిస్తున్నారని ఎస్‌ఐ వివరించారు. ఎస్.రాయవరం నుంచి తామరం బయల్దేరి పెదబొడ్డేపల్లిలో బస్సు దిగిపోయి ఉంటుందని తెలిపారు. వాహనాలు అందుబాటులో లేక పెదబొడ్డేపల్లి నుంచి తామరం నడుచుకొని వెళ్తుండగా గుర్తుతెలియన వాహనం ఢీకొని ఉంటుందని భావిస్తున్నట్టు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నీటి సంపులో పడి సెక్యూరిటీ గార్డు..


గణేశ్ మృతదేహం

విశాఖపట్నం, మార్చి 27: విధి నిర్వహణలో ఉన్న ఓ సెక్యూరిటీ గార్డు ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి మృతి చెందాడు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా కశింకోటకు చెందిన అల్లవరపు గణేశ్ (32) ఆటోనగర్‌లోని టీపీఎల్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ఇక్కడి మంగళపాలెంలో గణేశ్ భార్య దేవి, తల్లి రత్నతో కలిసి ఉంటున్నాడు. మంగళవారం విధులకు వెళ్లిన గణేశ్ బుధవారం ఉదయం ఇంటికి రాకపోవడంతో భార్య ఆందోళనకు గురైంది. కాగా అదే కంపెనీలో పనిచేస్తున్న కె.శ్రీను అనే వ్యక్తి ఆమెకు ఫోన్ చేసి కంపెనీ ఆవరణలోని నీటి సంపులో పడి గణేశ్ మృతి చెందినట్టు తెలిపాడు. కంపెనీ యాజమాన్యం అందించిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని గణేశ్ మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడికి మూడేళ్ల క్రితమే వివాహమైంది. దేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి గాయాలు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సాలాపు శ్రీను

సబ్బవరం, మార్చి 27: సబ్బవరం-చోడవరం రోడ్డులో బంగారమ్మపాలెం వద్ద బుధవారం బైక్ అదుపు తప్పడంతో యువకుడు గాయపడ్డారు. బంగారమ్మపాలెంకు చెందిన సాలాపు శ్రీను తల్లి దండ్రులు ఉపాధి నిమిత్తం కొత్తవలసలో స్థిరపడ్డారు. గ్రామంలో ముత్యమాంబ అమ్మవారి జాతరకు స్వగ్రామం బంగారమ్మపాలెం ఇటీవల వచ్చారు. ఈ నేపథ్యంలో పని మీద శ్రీను బైక్‌పై వెళుతుండగా గ్రామ సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కన గల కాలువలోకి దూసుకుపోవడంతో గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు సబ్బవరం పీహెచ్‌సీకి తరలించగా.. వైద్యుడు డాక్టర్ చక్రవర్తి వైద్యసేవలు అందించారు. పరిస్థితి మెరుగైనట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న చంటిబాబు

పెదబయలు, మార్చి 27: మండలంలోని లక్ష్మీపేట సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రంగా గాయాలు తగిలాయి. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెదబయలు నుంచి లక్ష్మీపేట వైపు వెళుతున్న ప్రైవేటు జీపు లక్ష్మీపేట సమీపంలో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో బొండపల్లి పంచాయతీ కేంద్రానికి చెందిన వి.చంటిబాబు, లక్ష్మీపేట పంచాయతీ మండిబ గ్రామానికి చెందిన జోగేంద్రకు తీవ్రమైన గాయాలు తగిలాయి. క్షతగాత్రులకు స్థానికుల సహాయంతో పెదబయలు పీహెచ్‌సీకి తరలించారు.

సుదర్శన నారసింహ మహా యజ్ఞానికి శ్రీకారం


పూర్ణాహుతిలో స్వరూపానంద, స్వాత్మానందేంద్ర

సింహాచలం, మార్చి 27: వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధి బుధవారం ఆధ్యాత్మిక శోభతో అలరారింది. పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో లోకకల్యాణార్థం చతుర్వేద హవనపూర్వక పాంచాహ్నిక పంచకుండాత్మక శ్రీసుదర్శన నారసింహ మహాయజ్ఞానికి అగ్నిమథనంతో బాలాగ్నిని జనింపజేసి శ్రీకారం చుట్టారు. లోకకల్యాణార్థం ఈనెల 26న అంకురార్పణంతో యాగాన్ని ప్రారంభించారు. బుధవారం ఉదయం గోమాతను ప్రవేశపెట్టి పూజలు చేశారు. అనంతరం సింహగిరి మాడవీధుల్లో గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులు, సుదర్శనుని యాగశాల ప్రవేశం జరిపారు. గరుడగద్యలు పఠిస్తూ ధ్వజారోహణం గావించి దేవతలకు ఆహ్వానం పలికారు. ప్రత్యక్షంగా పాల్గొన్న సుమారు 120 జంటలకు పూజాసామగ్రిని అందజేశారు. భక్తులతో సంకల్పం చెప్పించి షోడశోపచారాల సమర్పణ, నృసింహ అష్టోత్తర శతనామావళితో పూజలు జరిపించారు. స్థానాచార్యులు డా.టీపీ రాజగోపాల్ పర్యవేక్షణలో ఈవో సింగల శ్రీనివాసమూర్తి దంపతులకు, తరువాత భూరి విరాళాలు సమర్పించిన దాతలు కేతినేడి సాయికుమార్, బోకం శ్రీనివాసరావులకు కంకణధారణ చేశారు. దేవతా వృక్షానికి చెందిన రెండు దారువులను రాపిడి చేయడం ద్వారా సశాస్త్రీయంగా అగ్నిమథనం కావించి బాలాగ్నిని జనియింపజేసి హోమకుండాలలో అగ్నిప్రతిష్ఠాపన జరిపారు. తొలిరోజు లఘు పూర్ణాహుతి చేసి తీర్థప్రసాదాల వినియోగం జరిపారు. లఘుపూర్ణాహుతిలో దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు, శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి, పూసపాటి ఆనందగజపతిరాజు సతీమణి సుధాగజపతిరాజు, పాలకమండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	107.00
లైవ్ ధర	127.00
విత్ స్కిన్	224.00
స్కిన్ లెస్	234.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

వలస మత్స్యకార ఓట్లకు వేట

- పూరీ వెళ్లిన పేట టీడీపీ,జనసేన మత్స్యకార నేతలు
- ఓటు బ్యాంకు చెదిరిపోకుండా వ్యూహం
- నేడు అనితతో పూరీ, కోణార్క్‌ల్లో సమావేశం


పూరీలో మత్స్యకారులతో సమావేశమైన టీడీపీ మత్స్యకార నాయకులు


పూరీలో ఇంటింటా తిరుగుతున్న నక్కపల్లి మండలం టీడీపీ మత్స్యకార నాయకులు

నక్కపల్లి, మార్చి 27: ఉమ్మడి విశాఖ జిల్లాలోనే 18 మత్స్యకార గ్రామాలున్న ఏకైక నియోజకవర్గం పాయకరావుపేట. టీడీపీ ఆవిర్భావం నుంచి ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లోని మత్స్యకారులు సైకిల్‌నే ఎక్కువగా ఆదరిస్తున్నారు. ఈ మూడు మండలాల్లో వున్న మత్స్యకారుల్లో 6,500 నుంచి 7 వేల మంది ఓటర్లు ఒడిశాలోని పూరీ, కోణార్క్‌ల్లో చేపల వేటను కొనసాగిస్తుంటారు. పండుగలు, గ్రామ దేవత ఉత్సవాలకు కుటుంబాలు, బంధువుల ఇంట జరిగే శుభకార్యాలకు, ఎన్నికల సమయంలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి మత్స్యకారులు తమ గ్రామాలకు వస్తుంటారు.

పూరీ, కోణార్క్‌లో వున్న తమ ఓటు బ్యాంకును కాపాడుకోవడం కోసం టీడీపీ మత్స్యకార నాయకులు వ్యూహం రూపొందిస్తున్నారు. నక్కపల్లి మండలం రాజయ్యపేట పంచాయతీ పరిధి రాజయ్యపేట, బోయపాడు శివారు గ్రామాల్లో 6వేలకు పైగా ఓట్లు వుండగా, వీరిలో దాదాపు 2,500 మంది మత్స్యకార ఓటర్లు పూరీ,కోణార్క్‌ల్లో వుంటున్నారు. దీంతో ఆ గ్రామ టీడీపీ, జనసేన మత్స్యకార నాయకులు పిక్కి శ్రీనివాసరావు, పిక్కి కొర్లయ్య, పిక్కి కోదండ, పిక్కి కొండలరావు, సిరిపిల్లి అప్పలరాజు, మడదా రాంబాబు, మేరుగు నాగేశ్వరరావు, గోసల చినతాతారావు, జనసేన నాయకులు పిక్కి స్వామి, వాసుపల్లి నూకరాజు మంగళవారం ఇక్కడి నుంచి బయల్దేరి పూరీ చేరుకున్నారు. బుధవారం పూరీలో ఇంటింటా సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం చేసి ముందుగా మత్స్యకారులతో మాట్లాడారు. పలుచోట్ల సమావేశాలు నిర్వహించారు. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత కూడా బుధవారం పూరీకి బయల్దేరి వెళ్లారు. గురువారం పూరీ, కోణార్క్‌లో పలువురు మత్స్యకారులను కలిసి వారితో సమావేశం కానున్నారు. పెదతీనార్ల, చినతీనార్ల, డీఎల్‌పురం, అమలాపురం సహా పాయకరావుపేట, ఎస్.రాయవరం మండలాల నుంచి కూడా పలువురు మత్స్యకార టీడీపీ నాయకులు ఇప్పటికే పూరీ చేరుకున్నారు.

వెంకన్న క్షేత్రంలో పుష్పయాగోత్సవాలు


ఆలయంలో ప్రాకారసేవలో భాగంగా పల్లకీ మోస్తున్న అర్చకుల బృందం

నక్కపల్లి, మార్చి 27: ఉపమాక వెంకన్న వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి నుంచి ఆలయంలో స్వామివారి పుష్పయాగోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం రాత్రి వరకూ ఈ కార్యక్రమాలు జరుగుతాయి. ఆలయ రాతి కల్యాణ మండపంలో వున్న అద్దాల మండపం (శయన మందిరం)లో ఉభయ దేవేరులతో కూడిన కల్యాణ వేంకటేశ్వరుడిని, ఊయలలో పుష్పమాలలు, పట్టుపీతాంబరాలతో అలంకరించారు. ఈ సందర్భంగా అర్చకులు,భక్తులంతా అయ్యవారి, అమ్మవారి సరస సంవాదాన్ని ఎంతో చక్కగా జరిపించారు. అంతకుముందు ఆలయ ఆ స్థానమండపం చుట్టూ ఆలయ అర్చకుల బృందం పల్లకీతో ప్రాకార సేవ చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

హామీలు అమలు చేయని వైసీపీని ఓడించాలి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు


బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మాట తప్పిన వైసీపీని రానున్న ఎన్నికల్లో ఓటర్లు చిత్తుగా ఓడించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత ఎన్నికల ముందు రాష్ట్రంలో సంపూర్ణ మద్యనిషేధం అమలుచేసి ఓట్లు అడుగుతానని చెప్పిన జగన్ హామీ ఎందుకు అమలు చేయలేదో సమాధానం చెప్పాలన్నారు. నాసిరకం మద్యం అమ్మకాలు జరపడం ద్వారా రాష్ట్రంలో 35 లక్షల మందికిపైగా ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేసిన ఘనత జగన్‌దేనన్నారు. అనేకమంది నాసిరకం మద్యం సేవించి అనారోగ్య సమస్యలతో మంచాన పడ్డారని ఆరోపించారు. కరెంట్ చార్జీలు పూర్తిగా తగ్గిస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చి, ఐదేళ్లలో 9 సార్లు కరెంట్ చార్జీలు పెంచడం ద్వారా రాష్ట్ర ప్రజలపై రూ.64 వేల కోట్ల అదనపు భారాన్ని మోపారని ఆరోపించారు. రైతుల పొలాలకు ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పి, ఎంపీ అవినాష్‌రెడ్డి బినామీ కంపెనీకి మీటర్లు ఏర్పాటు చేసే కాంట్రాక్టు ఇచ్చి వేల కోట్లు దోచి పెట్టినందుకా మళ్లీ వైసీపీని గెలిపించాలని ప్రశ్నించారు. ప్రతి నెలా జనవరిలో నిరుద్యోగ యువతీ, యువకుల కోసం జాబ్ క్యాలండర్ విడుదల చేస్తామని చెప్పి మాట తప్పారని, ఇసుక, నిత్యావసర సరుకుల ధరలు తగ్గిస్తామని చెప్పి నాలుగు రెట్లు ధరలు పెంచినందుకా మళ్లీ వైసీపీ అధికారంలోకి రావాలని అడుగుతున్నారు అని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో విజ్ఞులైన ఓటర్లు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించుకొని, రాష్ట్ర అభివృద్ధికి టీడీపీ అధినేత చంద్రబాబు నాయకత్వంలో సుస్థిరంగా అభివృద్ధి చేసుకొనేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు ప్రచారంలో పాల్గొంటే క్రిమినల్ చర్యలు

- కాశీపురంలో ఆర్టీసీ ఉద్యోగిపై ఫిర్యాదు
- విచారణ జరపాలని సదరు అధికారులకు సూచన
- మాడుగుల నియోజకవర్గ ఆర్‌వో సత్యవాణి


వాకపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రిటర్నింగ్ ఆఫీసర్ సత్యవాణి తదితరులు

దేవరాపల్లి, మార్చి 27: ఎన్నికల నియమావళిని అంతా విధిగా పాటించాలని మాడుగుల నియోజకవర్గం రిటర్నింగ్ ఆఫీసర్ జి.వి.సత్యవాణి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటైన పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా పాల్గొంటే క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. కాశీపురం గ్రామానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నట్టు తమకు ఫిర్యాదు అందిందన్నారు. నిబంధనలు అతిక్రమించే సదరు ఉద్యోగిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆర్టీసీ అధికారులకు సూచించినట్టు చెప్పారు. నియోజకవర్గంలోని 235 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎన్నికల నిర్వహణకు పదిహేరు వందల మంది సిబ్బందిని సిద్ధం చేశామని, మరో పది శాతం సిబ్బందిని రిజర్వులో ఉంచుతున్నామని వివరించారు. ఎన్నికల ప్రచారం, సభలు, సమావేశాలకు విధిగా అనుమతి తీసుకోవాల్సిందిగా ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియలో మార్పులు

- రాజకీయ పార్టీల నాయకులు, వినియోగదారులు గుర్తించాలి : డీఆర్‌వో బి.దయానిధి


రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఆర్‌వో బి.దయానిధి

అనకాపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికలలో పోస్టల్ బ్యాలెట్ వినియోగంలో ఎన్నికల కమిషన్ నిబంధనలను మార్పు చేసిందని, ఈ విషయాన్ని రాజకీయ పార్టీల నాయకులు, పోస్టల్ బ్యాలెట్ వినియోగదారులు గుర్తించాలని జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌వో) బి.దయానిధి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో వెలువడిన అభ్యంతరాలను పరిశీలనలోకి తీసుకొని కొన్ని మార్పులు చేసినట్టు చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ఓటరు వెంట తీసుకువెళ్లకుండా వెంటనే వినియోగించే విధంగా ఎన్నికల కమిషన్ నిబంధనలను రూపొందించిందన్నారు. ఈ విషయాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా ఓటర్లకు తెలియజేసి, అవగాహన కల్పించాలని కోరారు. గతంలో మాదిరిగా పోస్టు ద్వారా ఓటరుకు పంపించడం జరగదని గుర్తించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి కేఎస్ కుమారి మాట్లాడుతూ వివిధ రకాల పోస్టల్, హోమ్ ఓటింగ్‌ల గురించి వివరించారు. సర్వీసు ఓటర్లు, ప్రత్యేక ఓటర్లు, ఎలక్షన్ విధులలో ఉన్నవారు వివిధ రకాలుగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకొనేందుకు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. 85 సంవత్సరాల వయస్సు దాటి అనారోగ్యంతో ఉన్న వారికి, 40 శాతం కంటే ఎక్కువగా వైకల్యం కలిగిన వారికి ముందుగా వారి అభ్యర్థన మేరకు పోలింగ్ అధికారి వారి ఇంటి వద్దకు వెళ్లి ఓటు వేయించుకుంటారని చెప్పారు. అయితే ఒకసారి హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నట్లయితే ఆ విధంగానే ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశం గురించి అర్హతగల ఓటర్లకు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీల నాయకులు, అధికారులు హాజరయ్యారు.


స్వాధీనం చేసుకున్న తాబేలు పిల్లలు

396 తాబేళ్ల పిల్లలు స్వాధీనం

విశాఖపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతా నుంచి చెన్నైకు రవాణా చేస్తున్న 396 సముద్ర తాబేళ్ల పిల్లలను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్‌ఐ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో వీటిని పట్టుకున్నారు. కోల్‌కతా నుంచి షాలిమార్ ఎక్స్‌ప్రెస్‌లో ఈ తాబేళ్లను తరలిస్తున్నారన్న సమాచారంతో దాడి చేసి పట్టుకున్నారు. తాబేళ్లను వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 షెడ్యూల్-5లో చేర్చారు. అందువల్ల తాబేళ్లు అక్రమ రవాణా నిషేధం. ఈ నేపథ్యంలో తాబేళ్లను అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని పట్టుకుని అటవీ శాఖకు అప్పగించారు.


ఎర్రవరంలో టీడీపీ వర్గీయులపై రాళ్లతో దాడులకు దిగిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు

ఎర్రవరంలో రెచ్చిపోయిన వైసీపీ మూక

- టీడీపీ వర్గీయులపై రాళ్లతో దాడి.. పలువురికి స్వల్ప గాయాలు
- ఇరువర్గాల వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు


టీడీపీ నేత నాగేశ్వరరావు ఇంటిపై పడిన రాళ్లు

గొలుగొండ, మార్చి 27: మండలంలోని ఎర్రవరంలో తెలుగుదేశం పార్టీ వర్గీయులపై వైసీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం రాళ్లతో దాడులకు దిగారు. పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలివి. ఎర్రవరం పంచాయతీ గొల్లపేట రామాలయం వీధిలో మంగళవారం గంగాదేవి పండగను నిర్వహించారు. ఈ వేడుకకు ఎర్రవరంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన యువకులు విచ్చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరుగుతుండగా, బయటి నుంచి విచ్చేసిన యువకులకు, ఎర్రవరం గ్రామానికి చెందిన యువకులకు స్వల్ప వివాదం చోటుచేసుకున్నట్టు స్థానికులు తెలిపారు. ఈ ఘటనను ఎర్రవరంలోని టీడీపీకి చెందిన అమరపల్లి నాగేశ్వరరావు సెల్‌ఫోన్ కెమెరా ద్వారా వీడియో తీస్తుండగా ఎర్రవరానికి చెందిన వైసీపీ నాయకులు దాడికి దిగారు. దీంతో స్థానికులు కలుగజేసుకుని వివాదం సద్దుమణిగేందుకు ప్రయత్నం చేశారు. ఇదిలావుంటే, బుధవారం మధ్యాహ్నం మూడుగంటల సమయంలో అమరపల్లి నాగేశ్వరరావు ఇంటిపైకి అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు మూకుమ్మడిగా రాళ్లతో దాడి చేశారు. పలువురికి స్వల్ప గాయాలు కావడంతో పాటు నాగేశ్వరరావు ఇంటిపై రాళ్లు పడ్డాయి. సాయంత్రం ఇరు వర్గాల వారు ఇందుకు సంబంధించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నట్టు గొలుగొండ ఎస్‌ఐ కృష్ణారావు విలేకరులకు తెలిపారు.

29న సీఎం రమేష్ రాక

- స్వాగతం పలికేందుకు అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలి
- మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

కొత్తూరు(అనకాపల్లి), మార్చి 27: ఈనెల 29న బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ అనకాపల్లికి రానున్నారని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. స్థానిక రింగురోడ్డు కూడలిలోని ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు, మూడు పార్టీల ముఖ్య నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా తెలుగుదేశం పార్టీ పొత్తు పెట్టుకుందని చెప్పారు. సీఎం రమేష్ ఈనెల 29న హైదరాబాద్ నుంచి నేరుగా విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారన్నారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి లంకెలపాలెం నుంచి ఆయనకు స్వాగతం పలకాలన్నారు. అనకాపల్లి వరకు భారీ ర్యాలీ జరుగుతుందన్నారు. అనంతరం భారీ స్థాయిలో సమావేశం జరగనుందని తెలిపారు. కూటమి పార్టీల కార్యకర్తలు, అభిమానులు ఒక్కొక్క నియోజకవర్గాల నుంచి 100 కారులతో ఆయనకు స్వాగతం పలికేందుకు తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, టీడీపీ ఎలమంచిలి ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, టీడీపీ మాడుగుల అభ్యర్థి పైలా ప్రసాదరావు, జనసేన ఎలమంచిలి అభ్యర్థి విజయ్ కుమార్, నసేన పార్టీ చోడవరం ఇన్‌చార్జి రాజు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అనకాపల్లి జిల్లాలోనే అధికం

- అరికట్టేందుకు అంతా కంకణబద్ధులు కావాలి
- తల్లిదండ్రుల్లో చైతన్యానికి గ్రామాల్లో కమిటీలు
- ఐసీడీఎస్ గొలుగొండ సీడీపీవో శ్రీగౌరి


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో శ్రీగౌరి

నాతవరం, మార్చి 27 : బాల్య వివాహాలను అరికట్టేందుకు అంతా కంకణబద్ధులు కావాలని ఐసీడీఎస్ గొలుగొండ సీడీపీవో శ్రీగౌరి కోరారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. బాల్య వివాహాలు రాష్ట్రంలోని అనకాపల్లి జిల్లాలోనే ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. మైనర్లకు వివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలపై విద్యావంతులంతా గ్రామాల్లో ఆయా బాలికల తల్లిదండ్రులను చైతన్యవంతులను చేయాల్సిందిగా ఆమె విజ్ఞప్తి చేశారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి గ్రామంలో కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రాంబాబు, తహసీల్దార్ రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాండవ షుగర్స్‌ని ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలి

- కార్మిక సంఘ నేతలు, రైతులు డిమాండ్


తాండవ షుగర్స్ దుస్థితిని వివరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

పాయకరావుపేట, మార్చి 27: మూతపడిన తాండవ చక్కెర కర్మాగారాన్ని తెరిపిస్తామని అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో చేర్చాలని కార్మిక నాయకులు, రైతులు డిమాండ్ చేశారు. బుధవారం ఫ్యాక్టరీ ఎదుట ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కార్మిక సంఘ నేతలు, రైతులు మాట్లాడుతూ ఐదు నియోజకవర్గాల్లోని వేల మంది చెరకు రైతుల కోసం ఆరు దశాబ్దాల క్రితం సహకార రంగంలో ఏర్పాటుచేసిన తాండవ షుగర్స్‌ను తెరిపించాలన్నారు. ఫ్యాక్టరీని ఆదుకునే ప్రయత్నాన్ని ప్రభుత్వాలు చేయలేదన్నారు. రైతులకు సకాలంలో పేమెంట్లు అందక చెరకు పంటకు దూరమవడంతో ఫ్యాక్టరీలో మూడేళ్లుగా క్రషింగ్ నిలిచిపోయిందన్నారు. కార్మికులకు రూ.11 కోట్ల జీతాల బకాయిలు ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. దీనివల్ల వందలాది కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని వాపోయారు. ఇప్పటికైనా రాజకీయ పార్టీలు స్పందించి తాండవ షుగర్స్‌ని తెరిపించేలా తమ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు కర్రి శ్రీను, కసిరెడ్డి నాగేశ్వరరావు, దండెం రమణ, ఎస్‌టీ.సీతారామ్మూర్తి, రైతులు ఆళ్ల నాగేశ్వరరావు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



గుమ్మగుడ గ్రామంలో దగ్ధమైన కాఫీ తోటలు

గుమ్మగుడలో కాఫీ తోటలు దగ్ధం

డుంబ్రిగుడ, మార్చి 27: మండలంలోని అరమ పంచాయతీ గుమ్మగుడ గ్రామంలో కాఫీ తోటలు దగ్ధమయ్యాయి. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తోటలకు నిప్పంటించారు. దీంతో గ్రామానికి చెందిన పాంగి సుందర్రావు అనే గిరిజనుడికి చెందిన ఎకరా కాఫీ తోటతోపాటు మిరియాలు, సిల్వర్‌ఓక్, పండ్ల మొక్కలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రతి ఏటా ఆదాయం వచ్చే తోటలకు దుండగులు నిప్పు అంటించడంతో రోడ్డున పడాల్సి వచ్చిందని బాధిత గిరిజనుడు లబోదిబోమని రోదిస్తున్నాడు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని ఆయన విన్నవించాడు.

పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటుచేయాలి

ముంచంగిపుట్టు, మార్చి 27: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన సౌకర్యాలను ఏర్పాటుచేయాలని ఎంపీడీవో కిరణ్‌కుమార్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి సెక్టార్, రూట్ ఆఫీసర్లతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ప్రధానంగా తాగునీరు, కుర్చీలు, టెంట్లు, ర్యాంప్ సదుపాయాలను కల్పించాలన్నారు. విద్యుత్ సమస్య తలెత్తకుండా చూడాలని, బస్సులు వెళ్లేందుకు రహదారులు సక్రమంగా ఉన్నాయో, లేదో తెలుసుకోవాలని, ప్రశాంతంగా ఎన్నికలను జరిగే విధంగా అందరూ కృషి చేయాలని ఎంపీడీవో సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఐ కె.రవీంద్ర, తహసీల్దార్ రఫీ జాన్ పాల్గొన్నారు.

ఉత్తుత్తి హడావుడే..!

ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలను కలిపే డుడుమ, జోలాపుట్టు జలాశయాలపై వాహన తనిఖీలు మొక్కుబడి తంతుగా జరుగుతున్నాయి. ఆయా జలాశయాలపై వాహన రాకపోకలు సాగించే మార్గాల గేట్లు రేయింబవళ్లు తేడా లేకుండా నిరంతరం తెరిచే ఉంటున్నాయి. ఫలితంగా అంతర్రాష్ట్ర దొంగలు ఆంధ్రా భూ భాగంలోకి సులభంగా ప్రవేశిస్తూ దర్జాగా దొంగతనాలు, దారి దోపిడీలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. దీనికితోడు దొంగలు పడ్డాక పోలీసులు చేసే హడావుడి తరువాత కనిపించడం లేదని మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మొక్కుబడి తంతుగా వాహనాలను తనిఖీలు నిర్వహించడం.. వివరాలు రికార్డు చేయకపోవడం.. చివరికి దొంగతనాల నివారణకు ప్రజలు సహకరించాలని ప్రకటనలు చేయడంతో అంతా ఉత్తుత్తి హడావుడే అంటూ వారు బహిరంగంగానే చర్చించుకోవడం విశేషం.

- సరిహద్దులో మొక్కుబడి తంతుగా వాహనాల తనిఖీలు
- జలాశయాలపై రేయింబవళ్లు తెరిచి ఉంటున్న వాహన మార్గం గేట్లు
- ఆంధ్రా భూ భాగంలోకి సులువుగా చొరబడుతున్న అంతర్రాష్ట్ర దొంగలు
- దర్జాగా చోరీలు.. బెంబేలెత్తుతున్న ముంచంగిపుట్టు ప్రజలు



ముంచంగిపుట్టులో దొంగల కోసం రాత్రి వేళల్లో పహారా కాస్తున్న యువకులు



జోలాపుట్టు జలాశయంపై తెరిచి ఉన్న సరిహద్దు గేట్లు

ముంచంగిపుట్టు, మార్చి 27: జోలాపుట్టు, డుడుమ జలాశయాలపై నుంచి రాకపోకలు సాగించే వాహనాలను గతంలో ఒడిశా పోలీసులు తనిఖీ చేసేవారు. అనంతరం వాహన నంబరుతో పాటు ఇతర వివరాలను రికార్డు చేసేవారు. అయితే వివిధ కారణాల వల్ల జలాశయాలపై సుమారు పదేళ్ల క్రితం ఒడిశా పోలీసులు వాహన తనిఖీలను, ఆ ప్రదేశంలో పహారాను ఎత్తివేశారు. దీంతో జల విద్యుత్ కేంద్రం ప్రాజెక్టు అధికారులు ప్రైవేటు సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేశారు. ఆయా జలాశయాలపై నుంచి రాకపోకలు సాగించే వాహనాల నంబర్లను, ఎక్కడ నుంచి వచ్చారు, తిరుగు ప్రయాణం ఎప్పుడు, ఇటుగా ఎందుకు వచ్చారు, తదితర వివరాలను వారు రికార్డు చేశాల్సి ఉంది. కానీ కొంత కాలంగా సెక్యూరిటీ గార్డులు ఉంటున్నారే తప్పితే అటుగా రాకపోకలు సాగించే వాహనాలకు సంబంధించి ఎటువంటి రికార్డులను నిర్వహించడంలేదు. దీంతో ఆయా మార్గాల్లో ఏ వాహనంలో ఎవరు వస్తున్నారో, ఎవరు వెళుతున్నారో తెలియని పరిస్థితి నెలకొంది.

జలాశయాలపై తెరిచి ఉంటున్న గేట్లు

జోలాపుట్టు, డుడుమ జలాశయాలపై వాహనాలు రాకపోకలు సాగించే మార్గం గేట్లు రేయింబవళ్లు తేడా లేకుండా తెరిచి ఉంటున్నాయి. ఇదే అదునుగా అంతర్రాష్ట్ర దొంగలు ఆంధ్రా భూ భాగంలోకి చొరబడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఆంధ్రాలోని ముంచంగిపుట్టు, పెదబయలు, పాడేరు, జి.మాడుగుల, అరకు తదితర ప్రాంతాల్లో సుమారు 18 ద్విచక్ర వాహనాలను ఒడిశాకు చెందిన అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహన దొంగల ముఠా ఎత్తుకుపోయిన విషయం తెలిసిందే. అప్పటిలో ముంచంగిపుట్టు పోలీస్ స్టేషన్ ఎస్ఐగా పనిచేసిన ఆర్.సంతోష్ సుమారు మూడు నెలలు శ్రమించి ఎంతో చాకచక్యంగా అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పట్టుకొని, వారు దొంగిలించిన ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాటిని బాధితులకు అప్పగించారు. అయితే జోలాపుట్టు జలాశయంపై కనీస వాహన తనిఖీలు చేపట్టకపోవడంతో అప్పట్లో అంతరాష్ట్ర దొంగల ముఠా ఆ మార్గం గుండానే మారుతి కారులో ఆంధ్రా భూ భాగంలోకి ప్రవేశించి, ఇక్కడ దొంగిలించిన ద్విచక్ర వాహనాలను అదే మార్గంలో ఒడిశాకు తీసుకువెళ్లి విక్రయాలు చేపట్టేవారు. ఇటీవల మండలంలోని మాకవరం పంచాయతీ కేంద్రంలో జరిగిన భారీ చోరీ సైతం అంతర్రాష్ట్ర దొంగల ముఠా పనిగానే ఆంధ్రా పోలీసులు అనుమానిస్తున్నారు. అలాగే దొంగలు తుపాకులు, కత్తులను సైతం వాడినట్టు పోలీసులు గుర్తించారు. అనంతరం ఒడిశా వైపు దొంగలు వెళ్లిపోయినట్టు పోలీసులు గుర్తించారు. ఆ రెండు జలాశయాల వద్ద వాహన తనిఖీలు చేపట్టకపోవడం, అటుగా రాకపోకలు సాగించే వాహనాలను వివరాను నమోదు చేయకపోవడంతో దొంగల ఆచూకీ తెలియరాలేదు. అలాగే కొద్ది రోజులుగా మండల పరిధిలో పలు దారి దోపిడీలు జరిగాయి. అవి కూడా అంతర్రాష్ట్ర దొంగల పనేనని పోలీసులు అనుమానిస్తున్నారు. కొద్ది రోజులుగా అంతర్రాష్ట్ర దొంగలు చోరీలకు పాల్పడడం, దారి దోపిడీలు చేయడంతో పాటు గ్రామాల్లో రాత్రి వేళల్లో అలజడులు సృష్టిస్తుండడంతో పాటు దొంగల వద్ద తుపాకులు, కత్తులు ఉండడంతో స్థానికులు భయాందోళన నడుమ జీవనం సాగిస్తున్నారు. ఫలితంగా మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో దొంగతనాల నివారణ, స్వతసిద్ధ రక్షణ కోసం యువకులు రాత్రి వేళల్లో పహారా కాస్తున్న దృశ్యాలు దర్శనమిస్తున్నాయి.

ఉమ్మడి అభ్యర్థిని నేనే..

- అరకు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి దొన్నుదొర

అరకులోయ, మార్చి 27: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో తొలి సీటు అరకులోయ అభ్యర్థిగా తననే స్వయంగా ప్రకటించారని, తొలి జాబితాలో తన పేరు ఉందని, తమ అధినేత ప్రకటనే ఫైనల్ అని టీడీపీ అరకులోయ అసెంబ్లీ అభ్యర్థి సియ్యారి దొన్నుదొర తెలిపారు. బుధవారం రాత్రి అరకులోయలోని స్వగృహంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ అధిష్ఠానం ఏ ఉద్దేశంతో అరకు అసెంబ్లీ అభ్యర్థిగా పాంగి రాజారావును ప్రకటించిందో తమకు తెలియదన్నారు. దీనిపై తమ అధిష్ఠానం నుంచి ఇప్పటి వరకు ఎటువంటి సమాచారం రాలేదన్నారు. నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అరకు అసెంబ్లీ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా తానే పోటీలో ఉంటానన్నారు. పెదలబుడు సర్పంచ్ దాస్‌బాబు, పార్టీ మండల అధ్యక్షుడు శెట్టి బాబురావులు మాట్లాడుతూ బీజేపీకి అరకు నియోజకవర్గంలో ఓట్ల శాతం ఎంత మేర ఉందని వారు పార్టీ నుంచి అభ్యర్థిని ప్రకటించారో తెలియడం లేదన్నారు. అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థిగా దొన్నుదొర గెలవబోతున్నారని, ఇప్పటికే నియోజకవర్గమంతా విస్తృతంగా ప్రచారం చేశామన్నారు.

ఏమిటీ గందరగోళం?

... 5వ పేజీ తరువాయి

అరకు టీడీపీ అభ్యర్థి ప్రకటన జరిగినప్పటికీ, తాజాగా అదే స్థానానికి బీజేపీ తమ అభ్యర్థిని ప్రకటించడంపై టీడీపీ శ్రేణులు విస్మయం వ్యక్తం చేస్తు న్నారు. ఈ పరిణామాలతో గందరగోళ పరిస్థితులు ఏర్పడి మన్యంలోని కూటమి అభ్యర్థులకు నష్టాన్ని కలిగించే ప్రమాదముందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

పాడేరు అసెంబ్లీ స్థానంలో టీడీపీకి లైన్ క్లియర్?

అరకులోయ అసెంబ్లీ స్థానంపై గందరగోళం పరిస్థితి అలా ఉంటే.. తాజా పరిణామం నేపథ్యంలో పాడేరు అసెంబ్లీ స్థానం టీడీపీకి కేటాయించేందుకు లైన్ క్లియర్ అయిందనే ప్రచారం ఏజెన్సీలో జరుగుతున్నది. ఇప్పటి వరకు పాడేరు అసెంబ్లీ స్థానం బీజేపీకి కేటాయించారని, నేడో రేపో ప్రకటిస్తారని ఎదురుచూస్తున్న తరుణంలో అనూహ్యంగా అరకులోయ అసెంబ్లీ స్థానానికి బీజేపీ అభ్యర్థిని ప్రకటించడం కూటమి శ్రేణులను ఆశ్చర్యానికి గురి చేసింది. దీంతో స్థానిక అసెంబ్లీ స్థానం ఒక టీడీపీకే దక్కుతుందని నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులు భావిస్తున్నారు. అయితే ప్రస్తుతం టీడీపీలో వున్న గ్రూపుల నేపథ్యంలో టికెట్ ఎవరికి దక్కుతుందనేది ఉత్కంఠగా మారింది. ఏది ఏమైనా పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థుల వ్యవహారం ప్రస్తుతం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

అందాల జలపాతానికి వెళ్లేదెల?

... 5వ పేజీ తరువాయి

అత్యధికంగా పర్యాటకులు తరలివస్తున్నారని, సోమవారం నుంచి శుక్రవారం వరకు ఓ మాదిరిగా సందర్శిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. జలపాతం అద్భుతంగా ఉందని, రహదారి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నామని పర్యాటకులు అంటున్నారని యర్రవరం గిరిజనులు చెబుతున్నారు.

జలపాతం అభివృద్ధిపై పట్టించుకోని పాలకులు

పర్యాటకుల ఆదరణ పొందుతున్న యర్రవరం జలపాతాన్ని అభివృద్ధి చేసేందుకు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. ఈ జలపాతాన్ని అభివృద్ధి చేయాలని పలుమార్లు వైసీపీ ప్రజాప్రతినిధులు, అధికారులకు స్థానిక యువకులు విన్నవించుకున్నారు. పాడేరు వెళ్లి స్పందనలోనూ పలుమార్లు ఫిర్యాదు చేశారు. వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులను ఆదివాసీలు కలిసి మొరపెట్టుకున్న ప్రతిసారి రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు చేశామని, నిధులు విడుదలకాగానే పనులు ప్రారంభిస్తామని చెప్పుకొచ్చారు. అయినే ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించిన దాఖలాలు లేవు. ప్రధానంగా సమగిరి నుంచి యర్రవరం జలపాతం వరకు రహదారి నిర్మించాలి. ఈ మార్గంలో రెండు చోట్ల కాలువలు ఉన్నాయి. ఇక్కడ కల్వర్టులు నిర్మించాలి. జలపాతం వద్ద పైనుంచి కిందకు పర్యాటకులు దిగేందుకు సరైన మార్గం లేదు. కొత్తపల్లి జలపాతం మాదిరిగా యర్రవరం జలపాతం వద్ద పైనుంచి కిందకు వెళ్లేందుకు 200 అడుగులు మెట్లు ఏర్పాటు చేయాలి. జలపాతం వద్ద పర్యాటకులు విశ్రాంతి తీసుకునేందు బెంచీలు, మరుగుదొడ్లు, రక్షిత మంచినీటి సదుపాయం కల్పిస్తే పర్యాటకులకు ఉపయోగకరంగా ఉంటుంది.

ఆదివాసీలకు తప్పని అవస్థలు

యర్రవరం జలపాతానికి వెళ్లే రహదారి మీదుగా సుమారు 12 గ్రామాల ఆదివాసీలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం ఈ మార్గంలో కేవలం ద్విచక్ర వాహనాలు, జీపులు మాత్రమే ప్రయాణిస్తున్నాయి. కార్లు, ఆటోలు వెళ్లే పరిస్థితి లేదు. వర్షాకాలంలో ఏ వాహనం ఈ మార్గంలో ప్రయాణించే పరిస్థితి లేదు. దీంతో ఈ ప్రాంత ఆదివాసీలకు రవాణా కష్టాలు తప్పడంలేదు.

B.Ed. SPOT & EWS ADMISSIONS
NOTIFICATION 2023-2024 (with or without Ed-CET)
CHAITANYA COLLEGE OF EDUCATION
CHEEDIKADA ROAD, CHODAVARAM – 531 036
ANAKAPALLI (DISTRICT), ANDHRA PRADESH
cce.bed@gmail.com Mobile: 9247897420
Applications are invited from the eligible candidates (In Degree 50% marks for OC candidates & 40% marks for other reserved categories of BC/SC/ST) to join from **30-03-2024** to **03-04-2024** in B.Ed under the Spot Admissions & EWS (for OC Candidates from AU & SVU only) seats are available in **Mathematics, Physical Sciences, Biological Sciences, Social Studies & English Methodology** subjects.
Place : Chodavaram
Date : 28-03-2024
BODDU LOVARAJU (CHITTI)
SECRETARY & CORRESPONDENT

శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు

- చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్
- సాగులు గిరిజనులకు విత్తనం, పనిముట్ల పంపిణీ



సాగులు రైతులకు టార్పాలిన్లు అందిస్తున్న అదనపు ఎస్పీ శివకిశోర్

చింతపల్లి, మార్చి 27: గిరిజన రైతులు వ్యవసాయంలో శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ చెప్పారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో బుధవారం హరిపురం కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తల సహకారంతో గిరిజన రైతులకు ఆధునిక సేద్య పద్ధతులపై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గూడెంకొత్తవీధి మండలం దేవరాపల్లి పంచాయతీ సాగులు, సిగినాపల్లి, మాడెం గ్రామానికి చెందిన ఆదివాసీ రైతులకు అల్లం విత్తనం, టార్పాలిన్లు, వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసీ రైతులు వ్యవసాయంపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. వరి, రాగి, కొర్ర, సామ పంటల సాగులో శ్రీ, గులి, జమున పద్ధతులను పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. రాజ్‌మా, అల్లం, పసుపు, మిరియాలు, కాఫీ సాగులోనూ మెళకువలు పాటించడం వల్ల రెట్టింపు దిగుబడులు పొందవచ్చునన్నారు. రాజ్‌మా, అల్లం, పసుపు, మిరియాలు, కాఫీ గ్రేడింగ్ చేసుకొని విక్రయిస్తే మంచి ధర పొందవచ్చునన్నారు. కాఫీని చెర్రీగా విక్రయించుకోకుండా పార్చిమెంట్‌గా తయారు చేసుకుని మార్కెటింగ్ చేసుకోవడం మంచిదన్నారు. సాగులు, సిగినాపల్లి, మాడెం గ్రామాల్లో రైతులు పంట పొలాల్లో భూసార పరీక్షలు చేయించామన్నారు. భూసార పరీక్షల ఆధారంగా శాస్త్రవేత్తలు సిఫారసు చేసిన పంటలను సాగు చేసుకోవాలన్నారు. గిరిజనుల వ్యవసాయ ప్రగతికి పోలీసు శాఖ ప్రోత్సాహం అందిస్తున్నదని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ కుర్ర శైలజ, అగ్రి ఇంజనీర్ శ్రీకాంత్ గౌడ్, చింతపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.రమేశ్, జీకే వీధి సబ్ ఇన్‌స్పెక్టర్ కె.అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

బొర్రాలో జిప్‌లైనర్ ఏర్పాటుపై విచారణ



అధికారులు, సిబ్బందితో విచారణ చేపడుతున్న త్రినాథరావు

అరకులోయ, మార్చి 28: అనంతగిరి మండలంలోని ప్రముఖ పర్యాటక సంస్థ బొర్రా గుహలు వద్ద జిప్‌లైనర్ ఏర్పాటుపై గిరిజన సంక్షేమ శాఖ న్యాయ సలహాదారు డాక్టర్ త్రినాథరావు బుధవారం విచారణ చేపట్టారు. బొర్రా గుహలు వద్ద జిప్‌లైనర్ ఏర్పాటు కోసం ప్రైవేటు వ్యక్తికి అనుమతిని ఇచ్చారని, గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా గిరిజనేతర వ్యక్తికి లాభం చేకూరేలా అధికారులు వ్యవహరించడం సరికాదని పలువురు ప్రజా ప్రతినిధులు, గిరిజన సంఘ నేతలతో పాటు రిటైర్డ్ ఐఏఎస్ శర్మ అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అలాగే ఈ అనుమతులు చట్టవిరుద్ధమని ఆందోళనలు చేసినప్పటికీ పర్యాటక సంస్థ అధికారులు కనీసం పట్టించుకోకుండా ప్రైవేటు వ్యక్తితోనే వ్యాపారం సాగించడంపై ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు సైతం పర్యాటక సంస్థ ఎండీ, ఈడీ దృష్టికి విషయం తీసుకువెళ్లారు. అయినప్పటికీ పర్యాటక సంస్థ అధికారుల్లో కనీస స్పందన లేకపోవడంతో రాష్ట్ర ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదులు చేశారు. దీంతో ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి చొరవతో కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకరరావు గత నెల జిప్‌లైనర్‌ను సందర్శించారు. దీన్ని వారు కూడా తప్పుబడుతూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, కార్యదర్శికి తెలియజేశారు. వారి ఆదేశాల మేరకు తహసీల్దార్ నాగజ్యోతి, ఎంపీడీవో నగేష్, ఆర్ఐ శంకరరావు, బొర్రా పంచాయతీ కార్యదర్శి రెడ్డితో కలిసి గిరిజన సంక్షేమ శాఖ న్యాయ సలహాదారు డాక్టర్ త్రినాథరావు విచారణ చేపట్టారు. పర్యాటక సంస్థ ఉద్యోగులు, గైడ్లు, ఎంపీటీసీ, పెసా కమిటీల సభ్యులతో మాట్లాడి, వారి వాంగ్మూలాలను తీసుకున్నారు. అలాగే జిప్ లైనర్‌లో పనిచేసే సిబ్బందిని కూడా విచారించారు. ఈ నివేదికను వారం రోజుల్లో ప్రభుత్వానికి అందజేస్తామని విచారణ అధికారులు తెలిపారు.

ఇమ్మ్యునైజేషన్ ప్రక్రియ పక్కాగా చేయండి

- జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి జమాల్ బాషా

హుకుంపేట, మార్చి 27: గ్రామాల్లో ఇమ్యునైజేషన్ ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని పారా మెడికల్ సిబ్బందికి జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ సి.జమాల్ బాషా సూచించారు. మండలంలోని మఠ్రిపాలెం, సోడా గ్రామాల్లో స్పెషల్ ఇమ్యునైజేషన్ జరుగుతున్న తీరును బుధవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో పారా మెడికల్ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ప్రక్రియ పక్కాగా జరగాలన్నారు. వ్యాధి నిరోధక టీకాల ప్రక్రియ సక్రమంగా నిర్వహిస్తే మాతాశిశు మరణాలు తగ్గుతాయని స్పష్టం చేశారు. అలాగే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన వైద్య సేవలు, పోషణ అందించాలని డీఎంహెచ్‌వో సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సౌమ్య, టీబీ సూపర్‌వైజర్ సదానందం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సోడా గ్రామంలో చిన్నారికి పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌భాషా

సూపర్-6 పథకాలపై విస్తృత ప్రచారం



తోటవలసలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

డుంబ్రిగుడ, మార్చి 27: మండలంలోని కొర్రాయి పంచాయతీ పరిధిలోని తోటవలస గ్రామంలో సూపర్-6 పథకాలపై టీడీపీ నాయకులు బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పంచాయతీ సర్పంచ్ కొములు ఆధ్వర్యంలో బూత్ లెవెల్ ఇన్‌చార్జులు ఒలేక్, నాగరాజు, మోహన్‌దాసు, టీడీపీ యువ నేత రాంబాబు, వార్డు సభ్యులు డొంబునాయుడు తదితరులు ఈ ప్రచారాన్ని చేపట్టారు. అనంతరం గ్రామస్థులతో సమావేశాన్ని ఏర్పాటుచేసి ప్రభుత్వ అరాచక విధానాలపై అవగాహన కల్పించారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలో వస్తే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, ప్రతీ ఇంటిలో చదువుతున్న పిల్లలందరికీ ఏడాకి రూ.15 వేలు చొప్పున చెల్లించనున్నట్టు చెప్పారు. అలాగే ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఇంటింటికీ సురక్షిత తాగునీటిని అందించన్నట్టు తెలిపారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సియ్యారి దొన్నుదొరకు ఓటేసి గెలిపించాలని, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు హరి, పొద్దు పాల్గొన్నారు.

30న కంటి వైద్య శిబిరం

జి.మాడుగుల, మార్చి 27: మండల కేంద్రంలో ఈ నెల 30న కేబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ రాజేంద్రదొర తెలిపారు. రామాలయం ప్రాంగణంలో శంకర్ ఫౌండేషన్ ద్వారా ఈ శిబిరం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నిపుణులైన వైద్యులు తనిఖీలు చేస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



టీడబ్ల్యూ డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ నేతలు

పాడేరు రూరల్, మార్చి 27: రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ జె.వెంకట మురళికి వినతి పత్రం అందించామని గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ తెలిపారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు బయాలజీ, ఇంగ్లీషు సబ్జెక్టులలో స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతులు కల్పించాలని, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌కు మంజూరైన డీవైఈవో పోస్టును సీనియర్ హెచ్ఎంలకు కల్పించాలని, స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతులు పొందిన భాషా పండిట్, పీఈటీలను ట్రెజరీ ఎస్ఎల్‌వోలో నమోదు చేయాలని, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘానికి ప్రభుత్వ గుర్తింపునకు అనుమతి ఇవ్వాలని కోరామన్నారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం రాష్ట్ర, ఏఎస్ఆర్ జిల్లా నాయకులు కె.నీలకంఠం, ఎం.శోభన్, ఎస్.మహేష్, టి.విజయ్, వి.బాలకృష్ణ పాల్గొన్నారు.

హాట్‌కేకుల్లా అమ్ముడైన ఐపీఎల్ టికెట్లు

... 5వ పేజీ తరువాయి

క్రీడాభిమానుల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. ఉదయం పది గంటలకు అమ్మకాలు ప్రారంభించగా...సెకన్లలోనే 70 వేలకు మందికిపైగా లాగిన్ అయ్యారు. విక్రయం ప్రారంభించిన రెండు గంటల్లోనే రూ.1,000, రూ.1,500, రూ.3,000, రూ.4,000 టికెట్లు అయిపోయాయి. మధ్యాహ్నం 12.30 గంటలకు రూ.1,000, రూ.1,500, రూ.3,000, రూ.4,000 టికెట్లు అమ్ముడైపోయాయని ప్రకటిస్తూ క్లోజ్ చేశారు. అయితే రూ.2,000, రూ.2,500, రూ.3,500, రూ.5,000 టికెట్లపై స్పష్టత లేదు. మిగిలిన టికెట్ల అమ్మకాలు గురువారం చేపడుతున్నదీ లేనిదీ కూడా నిర్వాహకులు ప్రకటించలేదు.

ఈ మ్యాచ్ కాకపోతే ఆ మ్యాచ్...

చెన్నై సూపర్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ టికెట్లు దొరక్కపోవడంతో కొందరు ఏప్రిల్ 3వ తేదీన కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగే మ్యాచ్ టికెట్లు తీసుకున్నారు. దీంతో బుధవారం రాత్రి సమయానికి రూ.1,000, రూ.1,500, రూ.2,000 టికెట్లు అమ్ముడైపోయాయి. రూ.2500, రూ.3000, రూ.3500, రూ.5000 ధర టికెట్లు అందుబాటులో ఉన్నాయి.


'పాడేరు టిక్కెట్ టీడీపీ అభ్యర్థికి కేటాయిస్తే భారీ మెజార్టీతో గెలిపిస్తాం'

సీలేరు, మార్చి 27: పాడేరు అసెంబ్లీ టిక్కెట్‌ను టీడీపీకి కేటాయిస్తే భారీ మెజారిటీతో గెలిపిస్తామని ఆ పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు చిటికెల రాము, సీలేరు అధ్యక్షుడు కె.సన్యాసిరావు పేర్కొన్నారు. బుధవారం విలేకరులతో వారు మాట్లాడుతూ పొత్తుల్లో భాగంగా ప్రతీసారి పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం టిక్కెట్ ఏదో ఒక పార్టీకి కేటాయిస్తుండడం బాధాకరమన్నారు. తాజాగా బీజేపీ అభ్యర్థికి కేటాయిస్తారంటూ జరుగుతున్న ప్రచారంతో నాయకులు, కార్యకర్తలు డీలా పడిపోయారని వాపోయారు. ఇప్పటికైనా అధినేత చంద్రబాబు పునరాలోచన చేసి పాడేరు టిక్కెట్‌ను గిడ్డి ఈశ్వరికి కేటాయించాలని కోరారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

చింతపల్లి, మార్చి 27: ఓటు హక్కు వినియోగించుకోవాలని విద్యార్థులు, రెవెన్యూ ఉద్యోగులు ర్యాలీ చేపట్టారు. తహీసల్దార్ టి.రామకృష్ణ ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయం నుంచి వారపు సంత మీదుగా డిగ్రీ కళాశాల వరకు బుధవారం ఈ ర్యాలీ సాగింది. డిగ్రీ కళాశాల మైదానంలో 'ఓటు వేద్దాం' అనే తెలుగు అక్షరమాల క్రమ పద్ధతిలో విద్యార్థినులు కూర్చొని ప్రదర్శనలు ఇచ్చారు. ఈ ప్రదర్శనను వారపు సంతకు వచ్చిన గిరిజన ప్రజలు ఆసక్తిగా తిలకించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ఓటు చాలా విలువైందని, సమర్థవంతమైన పాలకులను ఎన్నుకునే హక్కు, స్వేచ్ఛ ఓటర్లకు ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణమూర్తి, వీఆర్వోలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో పోస్టుమన్ మృతి



సత్యనారాయణ (ఫైల్ ఫొటో)

చింతపల్లి, మార్చి 27: స్థానిక పోస్టుమన్ చిందాడ సత్యనారాయణ అనారోగ్యంతో మృతి చెందారు. వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో కుటుంబీకులు కేజీహెచ్‌కు తరలించారు. బుధవారం సాయంత్రం చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. సత్యనారాయణకు భార్య జయలక్ష్మి చింతపల్లి-2 ఎంపీటీసీ సభ్యురాలుగా వ్యవహరిస్తున్నారు. అతని మృతికి వర్తక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జోగేశ్వరరావు, బేతాళుడు సంతాపం తెలిపారు.

మలేరియా స్థితిగతులపై ఆరా

... 5వ పేజీ తరువాయి

అయ్యారు. వంట్లమామిడి సచివాలయం పరిధిలోని వైద్య సిబ్బంది పని తీరు సక్రమంగా లేదని తెలిపారు. అలాగే మలేరియా నిర్ధారణ, నిర్మూలనకు హెల్త్ అసిస్టెంట్‌లు, ల్యాబ్ టెక్నీషియన్లు చేపట్టాల్సిన చర్యలను ఆమె వివరించారు. వైద్య ఆరోగ్య, మలేరియా విభాగం పనితీరును మరింత మెరుగుపర్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ నరసింహారావు, ఆరోగ్య విస్తరణాధికారులు బి.తిరుపతిరావు, బి.ధనుంజయరావు, ఏఎంవో డి.శేషాద్రి, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.